క్లుప్తంగా

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ



అర్చకుడు చిన్నికి బంగారం అందిస్తున్న వెంకట రవీంద్రరాజు, ఆదిలక్ష్మి దంపతులు

భీమవరం (ప్రకాశం చౌక్): మావుళ్లమ్మవారికి శనివారం భీమవరానికి చెందిన పెన్మెత్స వెంకట రవీంద్రరాజు ఆదిలక్ష్మి దంపతులు 10 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ(చిన్ని) అమ్మవారికి పూజలు చేసి, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

కుట్టుమెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: స్వాతంత్ర్య వేడుకల ముగింపు సందర్భంగా క్విట్ ఇండియా అమరవీరుల స్థూపం వద్ద వసుధ ఫౌండేషన్, మానవత భీమవరం మండల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పేద మహిళల ఉపాధి నిమిత్తం కుట్టుమెషీన్లను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సాంఘిక సేవా సంస్థల సేవలను ఎమ్మెల్యే అభినందించారు. మానవత సంస్థ అధ్యక్షుడు పూనారామం, కొత్తపల్లి కోదండ రామరాజు, చింతలపాటి రామకృష్ణంరాజు, సాగి వెంకట కృష్ణంరాజు, మెంటే పార్థసారథి, వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, బుద్ధరాజు వెంకటపతిరాజు, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు



భీమవరం టూటౌన్ ప్రాంతంలో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

భీమవరం: స్థానిక టూటౌన్ ప్రాంతంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ గొడవలు పడడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి ఘటనపై సీఐ జి కాళీ చరణ్ ప్రత్యేక దృష్టిపెట్టారు. సిబ్బందిని బృందంగా ఏర్పాటు చేసి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. టుటౌన్ శివారు ప్రాంతాల్లో కాపుకాచి మహిళలు, విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ఆకతాయిల ఆగడాలను కరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పోలీసు గస్తీ చేపట్టి ఏపనీ లేకుండా గుంపులు గుంపులుగా కూర్చునేవారికి హెచ్చరికలు జారీచేస్తున్నారు. గంజాయి వాడకంపై కూడా దృష్టిపెట్టి గంజాయి విక్రయం, సేవించే వారి వివరాలను సేకరిస్తున్నారు. కళాశాల వద్ద బైక్‌లపై కూర్చుని కాలక్షేపం చేసేవారిని, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. కళాశాల, పట్టణ శివారు ప్రాంతాల్లో రెండు, మూడు పర్యాయాలు కన్పించే యువకుల తల్లిదండ్రులను పిలిపించి వారికీ కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

మొగల్తూరు: శ్రావణ మాసం రెండోవ శనివారం కావడంతో మొగల్తూరులోని కేతీకీపుర సామ్రాజ్య శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గంగ పవన్ ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

వేములదీవి వెంకన్న ఆలయంలో..

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారిని శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. గ్రామానికి చెందిన పలువురి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమారాచార్యులు పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

కొల్లేరు ప్రాంతాన్ని కమ్మేస్తున్న కిక్కిస



ఉప్పుటేరు గట్ల వెంబడి విపరీతంగా పెరిగిన కిక్కిస



చినకాపవరం డ్రెయిన్‌ను ఆవరిస్తున్న కిక్కిస



కొల్లేరు తీరంలో పెదకాపవరం చేపల చెరువు గట్టుపై కిక్కిస

- పంట, మురుగు కాలువలను ఆవరిస్తున్న పొదలు
- దూదిపిందెల్లాంటి విత్తనాలతో విస్తరిస్తున్న వైనం
- పంటలు, ఆక్వా సాగుకు తీవ్ర అడ్డంకి

ఆకివీడు: కొల్లేరు తీర గ్రామాలకు కిక్కిస మొక్క శాపంగా మారింది. తీర గ్రామాల్ని, పంట, మురుగు కాలువలను, చెరువు గట్లను కిక్కిస కమ్మేస్తోంది. గడ్డి జాతికి చెందిన కిక్కిస కొల్లేరు ప్రాంతంలో అల్లుకుపోతోంది. నీటి ప్రవాహంలో కొట్టుకు వచ్చి ఈ ప్రాంతాన్ని ఆవరించింది. కొల్లేరు సరస్సు పరిసర ప్రాంతాల్లో కిక్కిస దట్టంగా పెరగడంతో వాటి నుంచి వచ్చే విత్తనాలు గాలికి ఎగిరి సమీప ప్రాంతాల్లో పడటంతో అక్కడ మొక్క మొలుస్తోంది. అంటుమొక్కగానూ, విత్తనం ద్వారా మొలకెత్తే కిక్కిస వల్ల ఏ విధమైన ఉపయోగం లేదు.

పంట కాలువలను వదలని వైనం

కిక్కిస వల్ల రైతులకు, చేపల రైతులకు, సమీప గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. పంట కాలువ గట్లు, మురుగు కాలువ గట్ల వెంబడి విపరీతంగా పెరిగిపోవడం, కాలువ లోపలకు చొచ్చుకు వెళ్లడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. కాలువలను తవ్వుతున్న సందర్భంలో వీటిని తొలగించడం కష్టతరంగా ఉంటోంది. ఉప్పుటేరు వెంబడి 20 ఏళ్లుగా విస్తృతంగా కిక్కిస పెరిగిపోయింది. అక్కడ నుంచి చినకాపవరం డ్రెయిన్‌లోకి ప్రవేశించి ఆకివీడు ప్రాంతం వరకూ కిక్కిస మొక్కల పొదలు పేరుకుపోయాయి. ఇదే తరహాలో పలు గ్రామాల్లోని పంట, మురుగు కాలువల్లోకి కిక్కిస చొచ్చుకువచ్చి ఆవరిస్తోంది. ఆదమరిస్తే చేపల చెరువు గట్లను కూడా ఆవరించేస్తోంది. దీనివల్ల మురుగునీరు, అదనపు నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలిగిస్తోంది.

ఇటీవల కలపగా వినియోగం

గడ్డి, జాతిగా ఉన్నప్పటికీ దాని కాండం దృఢంగా ఉంటుంది. దీంతో కొంత మేర వెదురుగా ఉపయోగించవచ్చుననే ప్రయత్నాలు చేశారు. కొల్లేరు తీరంలోని ప్రజలు ఇటీవల కిక్కిసను కలపగా ఉపయోగిస్తున్నారు. దడులకు, ఇంటిపై కప్పులకు ఉపయోగిస్తున్నారు. స్థానికులకు కొంత ఆదాయం చేకూర్చుతున్నప్పటికీ దీనిని పూర్తిస్థాయిలో ఉపయోగించే పరిస్థితి లేదు.

గతంలో పేపర్ మిల్లుకు

కొల్లేరు కిక్కిసను గతంలో పేపర్ మిల్లుకు వినియోగించేవారు. పేపర్ తయారీకి ఇది పూర్తిస్థాయిలో ఉపయోగపడక, అట్టల తయారీకి ఉపయోగించే ప్రయత్నాలు చేశారు. దానికీ అంతగా ఉపయోగం లేకపోవడంతో కిక్కిస ఎక్కడికక్కడ నిరుపయోగంగా ఉంది. కిక్కిస వినియోగంపై పరిశోధనలు జరగాలని పలువురు కోరుతున్నారు.

కాళ్లకూరు వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో వస్త్రాలకు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు స్వామి, అమ్మవార్లకు సమర్పించబడిన పంచెలు, చీరలకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ.72,270 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈఓ ఎం.అరుణకుమార్ శనివారం తెలిపారు. ఆకివీడు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణ అధికారి అల్లూరి సత్యనారాయణరాజు పర్యవేక్షణలో భక్తుల సమక్షంలో వేలం నిర్వహించామన్నారు. శ్రావణమాసం శనిత్రయోదశి పర్వదినం కావడంతో భక్తులు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ అష్టోత్తర శతనామార్చన, ఉంజల్ సేవ ఘనంగా నిర్వహించారు.

సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక జువ్వలపాలెం రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం సింహ సంక్రమణ పురస్కరించుకుని వెంకటేశ్వర స్వామి వారికి సుదర్శన హోమం, సహస్ర దీపోత్సవం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు, కార్యనిర్వహణ అధికారి రుద్రరాజు గంగాశ్రీదేవి పాల్గొన్నారు.

వైద్యులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి

ఉండి: వైద్యులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సునంద, బెన్నీ సామ్యూల్ కోరారు. శనివారం ఆయా పీహెచ్‌సీల పరిధిలో పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో జరిగిన డాక్టర్ దారుణ హత్య ఘటనపై ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి వైద్య సిబ్బంది, విద్యార్థులు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఎన్ని అంతుచిక్కని వ్యాధులు వచ్చినా ప్రాణాలకు తెగించి వైద్యులు రోగులకు వైద్యం చేసి వారి ప్రాణాలను కాపాడుతారని అన్నారు. వైద్యులకు సమాజంలో రక్షణ లేకుండా పోతోందని అన్నారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటన అనాగరికమని అన్నారు. సీహెచ్ఓ ఆర్ రామకృష్ణ, పీహెచ్ఎన్ ఎస్ హెప్సీకుమారి, రత్నరాజు, ఏఎన్ఎంలు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉండిలో మావహారం నిర్వహించిన పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది

మానవ మృగాలను ఉరి తీయాలి

ఆకివీడు: మహిళలపై అత్యాచారాలు చేసి, హత్యలకు పాల్పడుతున్న మానవ మృగాలను ఉరి తీయాలని పలువురు డిమాండ్ చేశారు. ఐఎంఏ, సీహెచ్‌సీ, లయన్స్ క్లబ్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ దారుణ హత్య ఘటనను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఎమ్మార్వో ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్సై బి.నాగబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండీ. బిలాల్ అధ్యక్షత వహించగా, వైద్యులు ఎంవీ.సూర్యనారాయణరాజు, కె.మహేష్ వర్మ, కె.మాధవి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ.మదనీ, ఎండీ.మస్తాన్ వలీ, లయన్స్ ప్రతినిధులు నరశింహం, కాకర్ల రాజేశ్వరి, మోరా జ్యోతి రెడ్డి, సీపీఎం నాయకులు సందక సూర్యకుమారి, చాంబర్ అధ్యక్షుడు జీవీ.సత్యనారాయణరాజు, జిమ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ర్యాలీ

భీమవరం: కలకత్తా మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా భీమవరంలో శనివారం ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గరల్స్ జిల్లా కన్వీనర్ చిన్నం శాంతి, కార్యదర్శి పి పూర్ణ మాట్లాడుతూ కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం అత్యంత దారుణమన్నారు. ఎన్ని చట్టాలున్నా మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి డి కల్యాణి మాట్లాడుతూ హతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతిబాబు మాట్లాడుతూ మహిళా ముఖ్యమంత్రిగా ఉన్న బెంగాల్‌లో మహిళపై అత్యాచారం, హత్య ఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, గణేష్, కె.సూర్య, పి.వాసు, సింధు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలంటూ వైద్య సిబ్బంది నిరసన

కాళ్ల: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోలకత్తాలో డాక్టర్ ట్రైనింగ్ విద్యార్థిపై అత్యాచారం చేసి చంపిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు సరాబు సునీల్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. అత్యాచారం చేసి హత్య చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు భవిష్యత్తు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జూనియర్ డాక్టర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో వైద్య సిబ్బందితోపాటు కలిసి ర్యాలీ నిర్వహించారు.



ఆకివీడు: ఎమ్మార్వో, ఎస్సైలకు వినతిపత్రం అందజేస్తున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎండీ అజ్మీనా నజరిన్, లయన్స్ ప్రతినిధులు



భీమవరం: ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీ పాల్గొన్న విద్యార్థులు



కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

సమాజంలోని సమస్యలపై స్పందించాలి



పెన్నాడ హైస్కూల్లో మాట్లాడుతున్న విష్ణు కళాశాల ప్రిన్సిపల్ ఎం వేణు

పాలకోడేరు : ప్రతి విద్యార్థి చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలని, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎం.వేణు అన్నారు. శనివారం పెన్నాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో 9, 10 తరగతుల విద్యార్థులకు విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ సమాజంలోని సమస్యలపై అవగాహన పెంచుకుంటూ వాటిపై స్పందించడం యువత బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన అధ్యాపకులు సీహెచ్ అనూష, జి అమూల్య, వీణాదరి, బీవీ ప్రశాంతి, పి కృష్ణ మాధురి, వై శ్యామలా మాధురి, హుస్సేన్, హెచ్ఓడీ ఆర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఉండి ఎస్సైగా నజీరుల్లా



ఉండి: ఉండి కొత్త ఎస్సైగా మహమ్మద్ నజీరుల్లా బాధ్యతలు చేపట్టారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఆయన తూర్పుగోదావరి జిల్లాలో తొలుత బాధ్యతలు చేపట్టి అనంతరం విజయవాడ ఏసీబీ శాఖకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం అక్కడి నుంచి ఉండికి ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఇదేస్థానంలో ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఆయన ఎం లక్ష్మణ్ ద్రాక్షారామం ఎస్సైగా బదిలీపై వెళ్లారు.

రెవెన్యూ ఉద్యోగి అనుమానాస్పద మృతి

కాళ్ల: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మనోవేదనతో ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటనపై కాళ్ల పోలీసు స్టేషన్లో శనివారం కేసు నమోదైంది. కాళ్ల ఎస్సై ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఉండి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.నందీశ్వరరావు (53) కాళ్ల మండలం పెదఅమీరం పరిధిలోని మెహర్ బాబా స్కూల్ వెనుక వైపు వేపచెట్టుకి ఉరి వేసుకున్నట్టు తెలిపారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కాళ్ల పోలీసు సిబ్బంది మృతదేహాన్ని కిందికి దింపి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పెనుగొండ మండలం ములపర్రు గ్రామానికి చెందిన నందీశ్వరరావు ఇటీవల వీఆర్వో నుంచి పదోన్నతి పొంది ఉండి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మరణానికి ఆర్థిక ఇబ్బందులు కారణమని, మృతుని భార్య రత్నకుమారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్పష్టం చేశారు.

ఏరియా ఆస్పత్రి వద్ద వైద్యుల నిరసన

భీమవరం(ప్రకాశం చౌక్): డాక్టర్లపై హింసకు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాన్ని కేంద్రం పక్కాగా అమలు చేయాలని, ఆసుపత్రులను సేఫ్ జోన్లుగా ప్రకటించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరం శాఖ అధ్యక్ష కార్యదర్శులు జి.బాలకృష్ణంరాజు, ఎన్ శంకర్ కుమార్ వర్మ, రాష్ట్ర యాక్షన్ కమిటీ సభ్యురాలు ఏంవీ స్వరాజ్యలక్ష్మి కోరారు. పశ్చిమ బెంగాల్‌లో విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా జాతీయ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం భీమవరంలో డాక్టర్లు వైద్య సేవలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక లీలా కృష్ణ గ్రాండ్ వద్ద పట్టణానికి చెందిన వైద్యులు క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బాలమురళీ కృష్ణ, జి.సూర్యనారాయణ రాజు, యిర్రింకి లక్ష్మి, జి.సుభాష్, యిర్రింకి సూర్యనారాయణరావు, జి.గోపాలరాజు, యిర్రింకి నరేష్ కుమార్, నారసవాణి, శ్వేత, పి.లక్ష్మీ ప్రత్యూష, వి.శ్రీరమ్య అమూల్య, కె.ప్రభాకర్, ఎస్ రాజేష్, జె.కరుణ కుమార్, సీహెచ్ సాయిబాబు, యూవీ రమణరాజు, వి.రామకృష్ణంరాజు, జి.రామకృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన

జూనియర్ డాక్టర్ హత్యకు నిరసిస్తూ భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సూపరింటెండెంట్ మాధవి కళ్యాణి ఆధ్వర్యంలో వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. గంట సమయం ఓపీ నిలుపుదల చేసి అత్యవసర కేసులకు మినహాయింపు ఇచ్చారు. జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాధవి కళ్యాణి డిమాండ్ చేశారు. వైద్యులపై దాడులు, హత్యలను ప్రజలందరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.గోవిందుబాబు, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల నిరసన

వీరవాసరం: వైద్య విద్యార్థిని హత్యాచారానికి కారకులైన దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండల ఆర్ఎంపీ, పీఎంపీలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మండలంలో వైద్య సేవలు నిలిపివేశామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోను సూర్యనారాయణ, షేక్ సత్తార్ సాహెబ్, గోపా సురేష్, దేవ రామకృష్ణ, బీడే సురేష్, రాజు, శివ, సత్తార్, బొక్కా సూర్యనారాయణ, కేవీఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

ఉండి: రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉండిలో శనివారం ఘనంగా నిర్వహించారు. సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

పెనుగొండ: బాల్య వివాహాలను ప్రోత్సహించినా, చేసినా కఠిన చర్యలు తప్పవని పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.కృష్ణకుమారి హెచ్చరించారు. శనివారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయం నిర్వహించిన సమావేశంలో బాల్య వివాహాలను నిరోధించడంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.సుగుణ సంధ్య, ఎంపీడీఓ పి.నరసింహప్రసాద్, ఈఓపీఆర్డీ టి.మూర్తి బాబు, పి.మమతా, జి.సుజాత, శ్యామలాంబ, డీవీఎస్ఆర్ఎస్ కుమారి, పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దుంపగడపలో ప్రజల ఆరోగ్యంపై డీపీఓ పరిశీలన



దుంపగడపలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజశేఖర్

ఆకివీడు: వైరల్ ఫీవర్ ప్రభావం వారం రోజులుంటుందని, దీని వల్ల ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పుల ప్రభావం మరో వారం రోజులుంటుందని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలో వింత జ్వరాలు లేవని, సైడ్ ఎఫెక్ట్‌ల వల్లే ఇబ్బందులున్నాయని తెలిపారు. దుంపగడపలో వింత జబ్బులు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించి డీపీఓ గ్రామంలో శనివారం పర్యటించారు. శానిటేషన్, మంచి నీటి సరఫరా, దోమల నివారణ చర్యలపై పంచాయతీ అధికారులతో సమీక్షించారు. అనంతరం వైద్యులు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, సర్పంచ్ ఎం.విశ్వేశ్వరరావుతో కలిసి గ్రామంలోని జబ్బులకు గురైన రోగుల ఇళ్లకు వెళ్లి ఆరా తీశారు. కాళ్ల నొప్పులు, మడం నొప్పులు, మొఖం ఉబ్బరం వంటి వాటికి మందులు వచ్చినట్లు చెప్పారు. గ్రామంలో దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్నట్లు వివరించారు. మంచినీటి సరఫరా మెరుగుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ఇంటింటా సర్వే చేసి, రోగుల్ని గుర్తించి, తగిన మందులు అందజేస్తున్నామని చెప్పారు. వైరల్ ఫీవర్ల ఉధృతి తగ్గిందన్నారు. వైరల్ ఫీవర్ వచ్చిన తరువాత రోగులు వెంటనే పీఎంపీ వైద్యుల వద్ద చికిత్స పొంది సైడ్ ఎఫెక్ట్‌తో ఇబ్బంది పడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారన్నారు. రోగులకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మలేరియా డిపార్టుమెంట్‌కు చెందిన సిబ్బంది ఎబేట్ దోమల మందును గ్రామంలో పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో అన్ని డ్రెయిన్లను శుభ్రపరచి, దోమల నివారణకు మందులు పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సుబ్బారావు పాల్గొన్నారు.